


# దాడి కేసులో నిందితుడి గుర్తింపు..

- సురేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడిగా అనుమానం..
- నిందితుడిపై ఇప్పటికే పలు కేసులు..
- దాడికి ముందు పలువురితో ఫోన్ సంభాషణలు..

**జనపదం, వికారాబాద్:** వికారాబాద్ కలెక్టర్ పై దాడి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దాడి చేసేలా జనాలను రెచ్చగొట్టిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. కుట్ర చేసిన సురేష్ అనే వ్యక్తి పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడని తెలిపారు. దాడి జరగడానికి కొన్ని గంటల ముందు పట్నం నరేందర్ రెడ్డితో 42 సార్లు సురేష్ మాట్లాడారని, అదే సమయంలో నరేందర్ రెడ్డి కేటీఆర్ తో ఆరుసార్లు ఫోన్లో మాట్లాడారని తెలిపారు. కాగా, సురేష్ పై ఇప్పటికే రేప్ కేసుతో సహా పలు కేసులు ఉన్నాయని, చెల్లెలి వరసయ్యే అమ్మాయిపై లైంగికదాడికి పాల్పడినట్టు ఆరోపణలపై కేసు నమోదు చేశారు. సురేష్ పై కేసులు తొలగిపోయేలా పట్నం నరేందర్ రెడ్డి సాయం చేశాడని ఆరోపణలూ ఉన్నాయి.

**విచారణ వేగం..**

కలెక్టర్ పై దాడి కేసులో విచారణ వేగం చేశారు. రాజకీయ ప్రేరేపితంతోనే దాడి జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు పోలీసులు వచ్చారు. ఘటనలో బీఆర్ఎస్ నేతల ప్రమేయంపై అనుమానాలు, దాడి ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరెందర్ రెడ్డి ప్రమేయం పై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కాగా, వికారాబాద్ వెళ్లడానికి ప్రయత్నాలు చేసిన ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పటోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. వికారాబాద్ లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో అనుమతించమని పోలీసులు చెప్పినట్టు సమాచారం. దీంతో వారు వికారాబాద్ పరిసర ప్రాంతాల నుంచి వెనుతిరిగినట్లు తెలుస్తోంది.

# ప్రభుత్వంపై దాడి..

**బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు**



**జనపదం, హైదరాబాద్ సిటీ:** నిన్న వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడి యంత్రాంగంపై కాదని, అది కాంగ్రెస్ ప్రభుత్వం పై జరిగిన దాడి అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. తనపై దాడి జరగలేదని కలెక్టర్ చెబుతున్నారని, మరి అలాంటప్పుడు అరెస్టులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. అంతేకాకుండా మూడు మండలాలను కరెంట్ లేకుండా నిర్బంధంలో ఎందుకుంచారని, ఇంటర్నెట్ బంద్ చేసి చరిత్ర ఎందుకు లిఖించారన్నారు. కొడంగల్ ఫార్మా కంపెనీ సూదిని సుజన్ రెడ్డిదని, అతను స్వయంగా రేవంత్ బామ్మర్ది అన్నారు. బామ్మర్ది పై ప్రేమతో ప్రజలపై దాడి చేస్తున్నారని, ఒక రకంగా చెప్పాలంటే ఫార్మా కంపెనీ కి ప్రభుత్వం బ్రోకరిజం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు.


జనపదం

JANAPADHAM

8 PM

మాపటేలి వార్తలు

హైదరాబాద్ | మంగళవారం 12 నవంబర్ 2024 | తెలుగు దినపత్రిక




# అసలు సినిమా ముందుంది..

## ఇది ట్రయల్ మాత్రమే రేవంత్...

- ప్రజల ప్రయోజనమే ముఖ్యం..
- అన్నీ బోగస్.. అంతా బక్వాజ్..
- రైతులను రోడ్డున పడేయొద్దు..
- మాఫీ మొత్తం చేయాలి..
- దేవుళ్లపై ప్రమాణం కాదు., పనులు చేసి చూపండి..
- మాజీ మంత్రి హరీష్ రావు..
- ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్రకు సంఘీభావం..
- వేములవాడ, జగిత్యాలలో పర్యటన..

**జనపదం, హైదరాబాద్ సిటీ:**

సంజయ్ పాదయాత్ర రేవంత్ రెడ్డి సర్కార్ కు ట్రైలర్ మాత్రమేనని, ముమ్ముందు 70 ఎంఎం సినిమా ఉంటుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రేవంత్ పాలనలో రైతుల ధాన్యం దళారుల పాలైందని, బోనస్ బోగస్ కాగా, రైతుబంధు అటకెక్కిందని, రుణమాఫీ దూరమైందని దుయ్యబట్టారు. మంగళవారం హరీష్ రావు వేములవాడ, జగిత్యాలలో పర్యటించారు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ చేపట్టిన పాదయాత్రకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యాత్రను ఉద్దేశించి మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే పదవి కంటే 60 లక్షల మంది రైతులకు రుణమాఫీ కావడమే ముఖ్యమని అందుకే రాజీనామాకు సిద్ధమయ్యానన్నారు. రైతులకు మద్దతుగా కోరుట్ల నుండి జగిత్యాల వరకు ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్రలో పాల్గొన్న అనంతరం నిర్వహించిన సభలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడారు. సంజయ్ మంచి ఎమ్మెల్యేగా మాత్రమే తెలుసని, అందరికీ యశోద హాస్పిటల్ డాక్టర్ గా తెలుసన్నారు. ఎవరికి ఆపద వచ్చినా ఫోన్ చేస్తే బిల్లు మాఫీ చేసేవాడని, వెన్నుముక శస్త్ర చికిత్స చేసే డాక్టర్ గా మంచి పేరు తెచ్చుకున్న సంజయ్ ఈరోజు దేశానికి వెన్నుముకైన రైతుల కోసం 25 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని అభినందించారు.

**నిద్ర వదిలించడానికే..**

రేవంత్ రెడ్డి పాలనలో రైతుల ధాన్యం దళారుల పాలైందని, క్వింటాల్ పైన ఒక్కొక్క రైతు వెయ్యి రూపాయలు నష్టపోతున్నారన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో రేవంత్ రెడ్డి వరి పంటకు బోనస్ అని అబద్ధం ప్రచారం చేస్తున్నాడని, వడ్ల కొనుగోలు సీజన్ వస్తుందంటే కేసీఆర్ నెలరోజుల ముందు నుండే రివ్యూ మీటింగ్ లో పెట్టేవాడని, వడ్లు కొన్న 24 గంటల లోపే పైసలు అందించేవాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్జును వదిలించడానికి రైతుల వడ్లు కొనాలని, మొద్దు నిద్రపోతున్న రేవంత్ ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్ర చేశారన్నారు.

**అంతా మోసం..**

ఎన్నికలప్పుడు ఎలక్షన్ కమిషన్ పర్మిషన్ ఇచ్చిందని, ఒకటి రెండు రోజుల్లో రైతుబంధు పైసలు రైతులకు వేస్తామని తాను ప్రకటిస్తే, కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కమిషన్ కు కంప్లైంట్ చేసి రైతుబంధు చేయకుండా ఆపిందని హరీష్ రావు అన్నారు. ఇప్పుడైతే 10000, కాంగ్రెస్ వస్తే 15000 వస్తాయని రైతులను నమ్మించి ఎన్నికల్లో కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు మేం రైతుల కోసం సిద్ధం చేసిన రైతుబంధు డబ్బులు పడ్డాయి తప్ప ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులు వెయ్యలేదన్నారు. బోనస్ బోగస్ అయిందని, రైతుబంధు రాకుండాపోయిందని, రుణమాఫీ మొక్కుబడిగా అయిందన్నారు. రేవంత్ రెడ్డి వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్లు పెట్టి రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. తనకు ప్రజలకంటే పదవి ముఖ్యం కాదని రాజీనామా చేస్తానంటే రేవంత్ ముఖం చాటేశాడన్నారు. దేవులంతా రేవంత్ రెడ్డి అనే పాపాత్ముడిని క్షమించాలని వేడుకున్నారు.

**అన్నీ వాయిదాలే..**

పంద్రాగస్టు వరకు పూర్తి రుణమాఫీ చేస్తానన్న రేవంత్ తర్వాత దసరాకు మార్చారని, ఇప్పుడు దీపావళి పోయినా రుణమాఫీ కాలేదన్నారు. రెండు లక్షల పైనున్న బకాయిలు కడితే రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి మోసం చేశాడని, నమ్మి బకాయిలు కట్టిన రైతులకు ఇంకా మాఫీ కాలేదన్నారు. ఇప్పటికైనా చేస్తానన్న రుణమాఫీ చేయాలన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కరోనా కష్టకాలంలో కూడా రుణమాఫీ చేశాడన్నారు. మరీ మూసీ సుందరీకరణకు లక్షా యాభై వేల కోట్లు ఎలా వస్తున్నాయన్నారు.

**బూతుల సీఎం..**

జగిత్యాలలో చుక్క నీళ్ల కోసం వరద కాలువలో ధర్నా చేసే పరిస్థితి ఉండేదని, కేసీఆర్ వరద కాలవను రిజర్వాయర్ గా మార్చిండని, కాలువ నుండి మోటార్లు పెట్టి రివర్స్ పంపింగ్ ద్వారా నీళ్లను తెచ్చిండన్నారు. చెరువులన్నిటికి తూములు పెట్టి వరద కాలువ ద్వారా నీళ్ళను అందించి రెండు పంటలు పండేలాగా చేసిండన్నారు. కేసీఆర్ దేశంలో రైతుల సీఎంగా పేరు పొందిండని, రేవంత్ రెడ్డి మాత్రం బూతుల సీఎంగా పేరు పొందాడన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్ళు తెరిచి మంత్రులు భూమి మీద తిరిగితే సమస్యలు తెలుస్తాయన్నారు. రైతులు ముఖ్యమంత్రిని వడ్ల లోడు ఎత్తుమని అడుగుతున్నారని, ఆయనేమో మహారాష్ట్ర కు డబ్బు మూటల లోడు తీసుకెళ్తున్నాడన్నారు.

**మూసీ కంపు కంటే ఎక్కువ..**

మూసీ పాదయాత్ర దమ్ముంటే ఇల్లు కూలగొట్టిన చోట నుంచి చేయాలని సవాల్ విసిరారు. మూసీ కంపు కంటే రేవంత్ రెడ్డి కంపు ఎక్కువైందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా రేవంత్ రుణమాఫీ సంపూర్ణం చేయాలని, వడ్ల కొనుగోళ్లు త్వరగా ముగిసేలా చూడాలన్నారు. అలాగే అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని కోరారు. అవ్వ తాతలకు 4,000 పెన్షన్ ఇవ్వాలని, 15000 రైతు భరోసా ఇవ్వాలని, మహిళలకు 2500 రూపాయలు ఇవ్వాలని కోరారు. వందరోజుల్లో ఇచ్చిన హామీల అమలు చేస్తామని చెప్పిన వ్యక్తి 300 రోజులు దాటిన సందర్భంలోనైనా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యా భరోసా కార్డులివ్వాలని, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలివ్వాలని కోరారు. సుమారు రూ. 300 కోట్లు ఖర్చుపెట్టి పేపర్లలో ఘనంగా అడ్వర్టైజ్మెంట్ లు ఇచ్చుకోవడం కాకుండా నిరుద్యోగులకు ఉద్యోగాలు చూపాలన్నారు.

**రోడ్డుకీడ్చిన ఘనుడు..**

పోలీసుల చేతులతో పోలీసోళకల భార్యాలు, పిల్లలను కొట్టించిన ఘనడు రేవంత్ రెడ్డి అన్నారు. గురుకుల విద్యార్థులను రోడ్లెక్కించాడని, అన్ని వర్గాలకు అన్యాయం చేసిన సీఎంగా రేవంత్ రెడ్డి రికార్డు క్రియేట్ చేశాడరన్నారు. ఇప్పటికే గురుకులాల్లో 37 మంది విద్యార్థులు చనిపోయారంటే ప్రభుత్వం నిర్లక్ష్యం ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. సంవత్సర కాలంలో రేవంత్ రెడ్డి జగిత్యాల జిల్లాకు చేసిన ఒక మంచి పని చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల కోసం రైతుల రుణమాఫీ కోసం రైతుబంధు కోసం 25 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన ఎమ్మెల్యే సంజయ్ కు మళ్లీ మళ్లీ అభినందనలు అంటూ హరీష్ రావు ముగించారు.





- బాజాప్తా జాతీయ మీడియా లోనే మాట్లాడుతాం..
- అమృత్ సహా అన్నీ ఎండ గడుతాం..
- రాష్ట్రంలో పాలన గాడి తప్పింది...
- ఏ ఊరెళ్లినా ప్రభుత్వం పై దుమ్మెత్తి పోస్తున్నారు..
- కలెక్టర్ పై దాడి జరగనప్పుడు కేసులందుకు..?
- బీజేపీని ఆపే సత్తా కాంగ్రెస్ కు లేదు...
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఢిల్లీలో మీడియా సమావేశం..

# మీసుక్కోవడం ఎందుకో..?!


## మేం ఢిల్లీ వస్తే మీకెందుకంత నొప్పి..

**జనపదం, న్యూఢిల్లీ:**

తెలంగాణలో జరిగిన అమృత టెండర్ల స్కాం పైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి, ఇతర రాష్ట్రాల ఎన్నికలకు తెలంగాణ ఏటీఎంగా మారిందని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే తెలంగాణలో జరుగుతున్న అవినీతి పైన స్పందించాలని, రాష్ట్రంలో జరుగుతున్న ఆర్ఆర్ టాక్స్ సంబంధించిన అవినీతి పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆధారాలతో సహా తెలంగాణ అమృత్ టెండర్లలో జరుగుతున్న అవినీతిపైన ఫిర్యాదు చేసిన తర్వాత ప్రధానమంత్రి స్పందిస్తారో లేదో చూడాలన్నారు.

**ఎండగడతాం..**

తెలంగాణలో జరుగుతున్న అవినీతి కార్యక్రమాలపైన రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. క్రోనీ క్యాపిటలిజం గురించి ఢిల్లీలో మాటలు చెబుతున్న రాహుల్ గాంధీని ఎండగడతామని, తెలంగాణలో అనేక అంశాలు అవినీతి జరుగుతూనే ఉన్నదని, నిన్న అమృత్ టెండర్ల పైన ఫిర్యాదు చేసిన సందర్భంగా కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ఈ అంశంలో చర్యలు తీసుకుంటామని హామీ



ఇచ్చారన్నారు. పార్లమెంట్ సమావేశాల వరకు సమయం ఇవ్వండి, సమాచారం సేకరించి చర్యలు తీసుకుంటామన్నారని గుర్తు చేశారు.

**రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే..**

తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి ఉన్నాయని, ముఖ్యమంత్రిపైన వచ్చే ప్రతి విమర్శకు కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించి కాపాడుతున్నారన్నారు. 8 మంది ఎంపీలున్నా ఇప్పటిదాకా 11 నెలలో ఒక్కరు కూడా ప్రభుత్వ అవినీతిపైన మాట్లాడలేదని, ఎంపీలను, ఎమ్మెల్యేలను గొర్రెల మాదిరి కొంటున్నారన్న మల్లికార్జున ఖర్గే తెలంగాణలోని గోట్ మందిని చూడాలని స్వాగతిస్తున్నానన్నారు.

**దేనికైనా భయపడేది లేదు..**

తనపై ఎలాంటి కేసు పెట్టుకున్నా, విచారణలు చేసుకున్న భయం లేదని, 5 వారాల కింద తెలంగాణ రెవెన్యూ మంత్రిపైన ఈడీ దాడి జరిగిందని, కానీ ఇప్పటిదాకా కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని, ఈడీ దాడి తర్వాత అదానీ వచ్చి అదే మంత్రితో చర్చలు చేశారని కేటీఆర్ విమర్శించారు. అదానీతో జరిగిన సమావేశం తాలూకు వివరాలను పొంగులేటి బయటపెట్టాలని, తనకు తాను కేబినెట్ లో కూర్చుని కొడుకుకు టెండర్ల పనులు కట్టబెడితే న్యాయం ఎలా అవుతుందని, ఎల్ అండ్ టీ, ఎన్ సీఎల్ కంపెనీల కన్నా రాఘవ కంపెనీ గొప్పదా అనే విషయమై మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**విచారణ జరపాలి..**

తెలంగాణ అమృత్ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని, రూ.8888 కోట్లకు పైగా టెండర్లు ప్రభుత్వం పిలిచిందని, వాటిలో జరిగిన అవినీతిపైన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కి ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్ రెడ్డికి షోదా కన్స్ట్రక్షన్ పేరుతో భారీగా టెండర్లను కట్టబెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రెండు కోట్ల రూపాయల వార్షిక లాభం ఉన్న కంపెనీకి వందల కోట్ల రూపాయల టెండర్లను కట్టబెట్టారని, అన్ని అర్హతలున్న ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీ ఉపయోగించి, టెండర్లు గెలుచుకున్న తర్వాత కేవలం 20 శాతం పనులను మాత్రమే అప్పగించి, మిగతావి రెండు కోట్ల వార్షిక లాభం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ బావమరిది కంపెనీ కి ఇచ్చారన్నారు.

**పదవులు కోల్పోయారు..**

191 ఆర్టికల్ ప్రకారం గతంలో సోనియాగాంధీ, ఈ మధ్యనే హేమంత్ సోరేన్ వంటి నాయకులపైన ఆరోపణలు వచ్చాయని, సోనియా గాంధీ పదవిని కూడా కోల్పోయారని గుర్తు చేశారు. త్వరలో రేవంత్ రెడ్డి, పొంగులేటి తమ పదవులు కోల్పోతారని కేటీఆర్ జోస్యం చెప్పారు. మహారాష్ట్రలో ఎన్నికలకు తెలంగాణ సొమ్ములు వాడుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేపర్ ప్రకటనలోని ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కానీ రాహుల్ అన్ని అమలు చేసినట్టు చెప్తున్నారన్నారు. కొడంగల్ లోని లగుచర్ల ప్రజల అందోళనపైన కేటీఆర్ ఘాటుగా స్పందించారు. బావమరిది కోసం అమృత్ టెండర్ల ద్వారా అమృతం పంచి కొడంగల్ ప్రజలకు విషం పంచుతున్నారన్నారు. ప్రజలను ఫార్మా కోసం లాఠీ చార్జీలు చేసి ఇబ్బందులు పెట్టి అరెస్టులు చేసి జైలుకు పంపుతున్నారని, అల్లుడి ఫార్మా కంపెనీ కోసం రేవంత్ కొడంగల్ ప్రజలను బలిపెట్టి భూములు లాక్కుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి అడ్డగోలు విధానాలపైన ధన దాహం పైన కొడంగల్ ప్రజలు చేసిన తిరుగుబాటు గొప్పదన్నారు. పోలీస్ రక్షణ లేకుండా ముఖ్యమంత్రి కొడంగల్ పోయే పరిస్థితి లేదన్నారు. కలెక్టర్ ను కొట్టేపరిస్థితి తెలంగాణలో, ఏపిలో ఎప్పుడు జరగలేదని, ఒకవైపు కలెక్టర్ తనపై దాడి జరగలేదంటూ స్వయంగా చెప్తున్నా మరి కేసులెందుకు, అరెస్టులెందుకో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు.

**ఎందుకంత భయం..**

తాము ఢిల్లీకి వస్తే కాంగ్రెస్ నేతలకు భయమెందుకో అర్థం కావడం లేదని కేటీఆర్ అన్నారు. ఢిల్లీకి వచ్చి జాతీయ మీడియా ముందు జాతీయ పార్టీల ముందు మీ పార్టీ అవినీతిని ఎండగడతామని, మంత్రి పొంగులేటి తాలూకు కంపెనీ పొందిన అవినీతి టెండర్ల పైన కూడా ఢిల్లీకి వచ్చి భరతం పడతామని, స్వయంగా కేబినెట్లో కూర్చుండి సొంత కంపెనీకి టెండర్లు ఇచ్చిన పొంగులేటి పదవి కూడా కచ్చితంగా పోతుందన్నారు.

# మంత్రితో అధికారుల భేటీ..



**జనపదం, హైదరాబాద్ సిటీ: సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో వికారాబాద్ కలెక్టర్, ఐజీ, ఎస్పీ, ఇతర అధికారులు మంగళవారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిన్న జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి హోదాలో జరిగింది.**

# చర్చలు జరపాలి..

**మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ**



**జనపదం, మహబూబ్ నగర్ :** కొడంగల్ నియోజకవర్గం దుద్యాల లగచర్లలో అధికారులపై దాడి బాధాకరమని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. వికారాబాద్ ఘటనపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీ వద్దంటూ గతకొన్ని రోజులుగా స్థానికులు చాలా కోపంతో ఉన్నారని, అలాంటి పరిస్థితులలో సెక్యూరిటీ లేకుండా అధికారులు గ్రామానికి వెళ్లారన్నారు. అధికారులపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. సామరస్య పూర్వకంగా, ఉద్యమాలు, చర్చలతో సమస్య పరిష్కరించుకుంటే మంచిదన్నారు. అయితే స్థానికంగా ఉన్న 6 గ్రామాల రైతులు ఫార్మా కంపెనీని చాలా వ్యతిరేకిస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఆ గ్రామాల ప్రజల అభిప్రాయాలను గౌరవించి చర్చలకు పిలవాలన్నారు. పార్టీ సీనియర్లను క్షేత్రస్థాయికి పంపించి అసలేం జరిగిందో నిజానిజాలు తెలుసుకుంటామని డీకే అరుణ అన్నారు.